క్లుప్తంగా

విజయదుర్గమ్మకు పల్లకీ సేవ



పల్లకీసేవ నిర్వహిస్తున్న భక్తులు

జంగారెడ్డిగూడెం: విజయదుర్గమ్మకు శుక్రవారం పల్లకీసేవ నిర్వహించారు. ఆలయ శాశ్వత కమిటీ చైర్మన్ మారిశెట్టి రాధాకృష్ణ, ప్రధాన కార్యదర్శి మాడా రామ్మోహనరావు పర్యవేక్షణలో అర్చకులు సుదర్శనం వేణుగోపాలచార్యులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పౌర్ణమి తిథి కావడంతో అమ్మవారిని సన్నాయి మేళతాళాల నడుమ పట్టణ పురవీధుల్లో వైభవంగా పల్లకీసేవ నిర్వహించారు. కార్యక్రమంలో రామిశెట్టి శ్రీనివాసరావు, మారిశెట్టి అంజన్‌కుమార్, గుడిమెట్ల యుగంధర్, యర్రం ఉదయ్‌కుమార్, వీరవల్లి శ్రీనివాసరావు, జల్లిపల్లి శివకృష్ణ, నీలం మధు, జియో కర్పూరం సతీష్, నిస్సాంకులం వెంకటరమణ, విష్ణుమాస్టర్ తదితరులు పాల్గొన్నారు.

అయ్యప్పకు ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకరణలో అయ్యప్పస్వామి

జంగారెడ్డిగూడెం: గుర్వాయిగూడెం గ్రామంలో వేంచేసియున్న హరిహరసుత అయ్యప్ప స్వామి జన్మ నక్షత్రమైన ఉత్తరా నక్షత్రం సందర్భంగా ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి మండపారాధన పంచామృత అభిషేకాలు, లక్ష్మీ గణపతి హోమం, నీరాజనం, మంత్రపుష్పాలు, తదితర పూజలు నిర్వహించారు. సెక్రెటరీ నెక్కలపూడి సూర్యచంద్రరావు, కోశాధికారి గుంట్ల వెంకటేశ్వరావు, కొల్లేపర కృష్ణారావు, చిన్ని వాసు స్వామి, భక్తులు పాల్గొన్నారు.

ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు



విశేష అలంకరణలో ముత్యాలమ్మ

జంగారెడ్డిగూడెం: ముత్యాలమ్మ ఆలయంలో శుక్రవారం సందర్భంగా అమ్మవారిని విశేషంగా అలకరించి, అర్చకులు ప్రత్యేక పూజలు నిర్వమించారు. ఆలయ నిర్మాణకర్త బవిరిశెట్టి మురళీకృష్ణ, పద్మకుమారి దంపతుల ఆధ్వర్యంలో ప్రధాన అర్చకులు బ్రహ్మశ్రీ కె.సీతారాం అమ్మవారికి పంచామృత ఏకవార రుద్రాభిషేకాలు నిర్వహించారు. బొమ్మగాని ధర్మరాజు, అరుణ్ కుమార్, చిన్ని నాగేశ్వరావు, నాగమణి, చోడవరపు రంగా, జ్యోతి, ప్రసాద్, విజయలక్ష్మి, మారిశెట్టి మంగా, వంకాయల వాసవి, తదితరులు పాల్గొన్నారు.


భక్తి శ్రద్ధలతో రంజాన్ ప్రార్థనలు



ప్రార్థనలు నిర్వహిస్తున్న ముస్లింలు

కొయ్యలగూడెం: రంజాన్ మాసం సందర్భంగా శుక్రవారం మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. పవిత్ర దైవ గ్రంథం ఖురాన్ అవతరించినది ×రమదాన్ (రంజాన్) మాసంలోనేనని ఇమామ్‌లు పేర్కొన్నారు. రమదాన్ పండుగకు మరో పేరు ఈద్ ఉల్ ఫిత్ర అన్నారు. ముస్లింలు భక్తిశ్రద్ధలతో ఉపవాసాలు ఫిత్రా, జకాత్ దానధర్మాలు చేసే ఫలితం మిగిలిన రోజుల కంటే కోటి రెట్లు ఎక్కువ అన్నది ఖురాన్ పేర్కొందన్నారు. కార్యక్రమంలో ముస్లింలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

మంచినీటి ట్యాంకు ప్రారంభం



తాగునీటి వాటర్ ట్యాంక్‌ను ప్రారంభిస్తున్న దృశ్యం

కొయ్యలగూడెం: గవరవరం పంచాయితీ వెంకయ్యపాలెం రోడ్డులో నూతనంగా నిర్మించిన సత్యసాయి తాగునీటి వాటర్ ట్యాంకును వరింపూడి సర్పంచ్ ముప్పిడి విజయకుమారి శుక్రవారం ప్రారంభించారు. ఈ ట్యాంకును కర్రి శ్రీనివాస్, వెంకటలక్ష్మి దంపతుల మరణించిన కుమారుడైన కార్తీక్ జ్ఞాపకార్థం రూ.లక్షతో ట్యాంకును నిర్మించారు. కార్యక్రమంలో తాడిగడప ఆంజనేయరాజు, జేష్ఠ రామకృష్ణ, జవ్వాది శ్రీను, తదితరులు పాల్గొన్నారు.

నేడు సర్వసభ్య సమావేశం

పెదవేగి : పెదవేగి మండల సర్వ సభ్య సమావేశం ఎంపీపీ తాతా రమ్య కుమార్ అధ్యక్షతన శనివారం ఉదయం 10 గంటలకు స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో నిర్వహిస్తున్నట్టు ఎంపీడీఓ పీ.శ్రీనివాస్ తెలిపారు. సమావేశంలో చింతమనేని ప్రభాకర్ ముఖ్య అతిథిగా పాల్గొంటారని తెలిపారు.

పని ఒత్తిడిలో సచివాలయ కార్యదర్శులు

- రోజుకో సర్వే చేయిస్తున్న కూటమి ప్రభుత్వం
- అన్నింటికీ సచివాలయ కార్యదర్శులే ఆధారం
- చెత్త సేకరణపై కూడా కార్యదర్శులపై ఒత్తిడి
- తీవ్ర మనోవేదన చెందుతున్న సెక్రటరీలు



చెత్త ఎత్తుతున్న కార్యదర్శి, సచివాలయ సిబ్బంది (ఫైల్)



సర్వే చేస్తున్న సచివాలయ సిబ్బంది (ఫైల్)

బుట్టాయగూడెం: కూటమి ప్రభుత్వం రోజుకో సర్వేతో ప్రజలను ఆందోళనకు గురి చేస్తుంది. ప్రజల నుంచి పూటకో వివరాలను రాబట్టమని సచివాలయ సిబ్బందితో ఆడుకుంటుంది. గ్రామ స్వరాజ్యాన్ని తీసుకురావాలనే లక్ష్యంతో గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వం గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ఏర్పాటు చేసింది. గ్రామాల్లోని 50 ఇళ్లకు ఒక వలంటీర్‌ను, 2000 ఇళ్లకు ఒక సచివాలయాన్ని ఏర్పాటు చేసింది. వలంటీర్లు, సచివాయ సిబ్బంది ప్రజలకు, ప్రభుత్వానికి వారధిలా పని చేస్తూ ప్రభుత్వ సేవలను సంక్షేమ పథకాలను ఇంటింటికీ చేరవేసే వారు. 2024లో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం వలంటీర్లను తొలగించింది.

సంక్షేమ పథకాల ఊసే లేదు

గత వైఎస్సార్ సీపీ ప్రభుత్వంలో నెలలో కనీసం రెండు మూడు సంక్షేమ పథకాలు అమలవుతూ ఉండేవి. ఆ పథకాలను ప్రజలకు అందించలసిన భాధ్యత సచివాలయ సిబ్బంది పైనే ఉండేది. కూటమి ప్రభుత్వం ఏర్పడి 10 నెలలు కావొస్తున్నా ఒక్క పింఛన్ పథకం తప్ప మరే సంక్షేమ పథకం అమలు చేయలేదు. దీంతో సిబ్బంది ఖాళీగా ఉండడం ఇష్టం లేక నానా రకాల సర్వేలు చేయిస్తున్నట్లు తెలుస్తుంది.

ఒకే సారి నాలుగు సర్వేలు

ప్రస్తుతం ఎన్ఆర్‌ఈజీఎస్ ఫీల్డ్ అసిస్టెంట్లు తప్ప మిగిలిన కార్యదర్శులతో గ్రామాల్లో సర్వేలు చేయిస్తున్నారు. పీ–4 సర్వే , వర్క్ ఫ్రమ్ హోం సర్వే, ఎంఎస్ఎంఈ సర్వే, చిల్డ్రన్ బర్త్ సర్వే, నాన్ రెసిడెన్షియల్ సర్వేలు ఒకేసారి చేస్తున్నారు. పీ–4 సర్వేలో ఎంపిక చేసిన వారి ఇళ్లకు వెళ్లి వారికి కారు, ఏసీ వంటివి ఉన్నాయా? ఎన్ని ద్విచక్ర వాహనాలు ఉన్నాయి? ఆదాయ పన్ను చెల్లిన్నారా? వంటి వివరాలను అడిగి తెలుసుకుంటున్నారు. పూర్తి వివరాలు నమోదు చేసిన తరువాత సెల్ నంబర్‌కు వచ్చే ఓటీపీని సచివాలయ కార్యదర్శికి చెప్పాల్సి ఉంటుంది. అలాగే వర్క్ ఫ్రమ్ హోం సర్వేలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్లు, ఇతర వివరాలు నమోదు చేస్తున్నారు. అలాగే ఎంఎస్ఎంఈ సర్వేలో సూక్ష్మ, చిన్న, మధ్య తరహా పరిశ్రమలు ఎన్ని ఉన్నాయి వాటి యజమానులు ఎవరు. ఎంత మందికి ఉపాధి కల్పిస్తున్నారు. రుణం ఏమైనా అవసరమా వంటి వివరాలు అడుగుతున్నారు. చిల్డ్రన్ బర్త్ సర్వేలో పుట్టిన బిడ్డకు బర్త్ సర్టిఫికెట్ తీసుకున్నారా, ఆధార్ కార్డు చేయించారా, చేయించకపోతే ఎందుకు చేయించలేదని వివరాలు నమోదు చేస్తున్నారు.

చెత్త సేకరణలో కార్యదర్శులపై ఒత్తిడి

ప్రస్తుతం వర్జీనీయా పొగాకు పనుల సీజన్ కావడంతో పాటు, పంచాయతీల్లో నెలవారీ జీతాలు సక్రమంగా ఇవ్వకపోవడంతో గ్రామాల్లో క్లాప్ మిత్రలుగా పని చేయడానికి ఎవరూ ముందుకు రావడం లేదు. క్షేత్ర స్థాయిలో క్లాప్ మిత్రలను నియమించడానికి అవసరమైన చర్యలు కూటమి ప్రభుత్వం తీసుకోవడం లేదు. అయినప్పటికీ ప్రతి గ్రామంలో 100 శాతం చెత్త సేకరణ చేయించాలని ఉన్నతాధికారుల ద్వారా కార్యదర్శులపై కూటమి ప్రభుత్వం తీవ్రమైన ఒత్తిడి చేయిస్తుంది.

25 నుంచి నూకాలమ్మ జాతర మహోత్సవాలు



ఆహ్వాన పత్రికలను ఆవిష్కరిస్తున్న కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: నూకాలమ్మ ఆలయంలో 61వ ఆలయ ఉగాది జాతర మహోత్సవాలను ఈ నెల 25వ తేదీ నుంచి నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ఆలయంలో ఆహ్వాన పత్రికలను ఆవిష్కరించారు. తొలుత ఆలయంలో ఉగాది జాతర మహోత్సవాలకు అంకురార్పణగా పందిరి రాట పాతి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మున్సిపల్ కమిషనర్ కొమ్మినేని వెంకట రమణ ముఖ్య అతిథిగా హాజరయ్యారు. బాలా త్రిపుర సుందరి పీఠ ఆధ్యాత్మిక ప్రతినిధి ఈమని శశికుమార్ శర్మ మాట్లాడుతూ మార్చి 25వ తేదీ నుంచి ఏప్రియల్ 12వ తేదీ వరకు జాతర మహోత్సవాలు నిర్వహిస్తారన్నారు. ఆలయ కమిటీ చైర్మన్ డాక్టర్ రాజాన సత్యనారాయణ (పండు), ఆలయ కమిటీ, తిప్పాభట్ల రామకృష్ణ మాస్టర్, నూకాంబిక సేవా బృందం సభ్యులు పాల్గొన్నారు.

ఘనంగా హోలీ వేడుకలు



జంగారెడ్డిగూడెం: హోలీ వేడుకలు నిర్వహిస్తున్న యువకులు



టి.నరసాపురం: హోలీ వేడుకలు నిర్వహిస్తున్న ప్రజలు

జంగారెడ్డిగూడెం: పట్టణంలో హోలీ పండుగను శుక్రవారం ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు, పలువురు వ్యాపారులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. అనంతరం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షుడు వందనపు వెంకటేశ్వరరావు, వైఎస్సార్ సీపీ జిల్లా మాజీ అధ్యక్షురాలు వందనపు సాయి బాల పద్మ నివాసం వద్ద కేక్‌ను కట్ చేశారు.

బంజారాల పవిత్ర పండుగ హోలీ

టి.నరసాపురం: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. బంజారా భజరంగీ భేరి సంఘం ఆధ్వర్యంలో కృష్ణాపురం గ్రామంలో హోలీ పండుగను సంప్రదాయబద్ధంగా నిర్వహించారు. సంఘ అధ్యక్షుడు జరభల చందా నాయక్ మాట్లాడుతూ గోర్ బంజారాలు చాలా పవిత్రంగా జరుపుకునే పండుగ హోలీ అన్నారు. సేవాలాల్ గుడి వద్ద భూక్యా రాములు, జరభల పూర్ణయ్య నాయక్ ఆధ్వర్యంలో భోగ్ భండారో కార్యక్రమం నిర్వహించారు. స్థానిక విజన్ యూపీ స్కూల్‌లో హోలీ వేడుకలు నిర్వహించారు. భూక్యా వేణు గోపాల్‌నాయక్, భూక్యా రాంబాబు, జరబల రమేష్, భూక్యా రాములు, ధరావత్ రాము, తేజావత్ చంద్రశేఖర్, తదితరులు పాల్గొన్నారు



పోలవరం రూరల్: హోలీ శుభాకాంక్షలు తెలుపుకుంటున్న చిన్నారులు

పోలవరంలో

పోలవరం రూరల్: మండలంలో హోలీ వేడుకలు ఘనంగా నిర్వహించారు. యువతీ యువకులు, చిన్నారులు శుభాకాంక్షలు తెలుపుకున్నారు. పాఠశాలకు సెలవు దినం కావడంతో విద్యార్థులు రంగులు పూసుకుంటూ కేరింతలు కొడుతూ ఉత్సాహంగా గడిపారు.

యానిమేటర్లపై అధికారుల వేధింపులు ఆపాలి



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ నాయకుడు సాయికిరణ్

కుక్కునూరు: వెలుగు యానిమేటర్లపై పని భారం తగ్గించి అధికారుల వేధింపులు ఆపాలని సీఐటీయూ మండల కార్యదర్శి యర్న సాయికిరణ్ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. శుక్రవారం స్థానిక సుందరయ్య భవనం ప్రజా సంఘాల కార్యాలయంలో యానిమేటర్ల సమావేశం దాసరి సౌజన్య అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా సాయికిరణ్ మాట్లాడుతూ గ్రామీణ పేదరిక నిర్మూలన కోసం చాలీచాలని గౌరవ వేతనాలతో ఇబ్బంది పడుతూ ప్రజలకు సంక్షేమ పథకాలను అదజేస్తున్న యానిమేటర్లు దుర్భర పరిస్థితులను ఎదుర్కొంటున్నారన్నారు. కూటమి సర్కారు అధికారంలోకి రాగానే యానిమేటర్లకు కాల పరిమితి సర్క్యులర్‌ను రద్దు చేస్తామని హామీ ఇచ్చారన్నారు. కాని అధికారం చేపట్టిన తరువాత ఇచ్చిన హామీని తుంగలో తొక్కారని విమర్శించారు. ఇకనైనా కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేసి యానిమేటర్లకు రూ.10 లక్షల బీమా, కనీస వేతనాలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో కుక్రగ్రేసి, మేడవరపు రమాదేవి, కుక్కునూరు స్రవంతి, అనురాధ, మాధవి, రామల్ల అలివేలు పాల్గొన్నారు.

స్మార్ట్ మీటర్లతో ప్రజలపై పెనుభారం



సమావేశంలో మాట్లాడుతున్న సీపీఎం నేత మన్నవ కృష్ణ చైతన్య

చింతలపూడి: స్మార్ట్ మీటర్ల వలన భవిష్యత్తులో ప్రజలపై మోయలేని భారం పడుతుందని స్మార్ట్ మీటర్ల ఏర్పాటును ఉపసంహరించుకోవాలని సీపీఐ జిల్లా కార్యదర్శి మన్నవ కృష్ణ చైతన్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. మన్నవ కృష్ణ చైతన్య మాట్లాడుతూ ఎన్నికలకు ముందు స్మార్ట్ మీటర్లు వ్యతిరేకించిన కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్మార్ట్ మీటర్లను బిగిస్తుందని ఆరోపించారు. స్మార్ట్ మీటర్లు బిగిస్తే వాటిని పగలగొట్టండని చెప్పిన నారా లోకేష్ స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ప్రజలకు సమాధానం చెప్పాలన్నారు. సమావేశంలో మామిళ్లపల్లి వసంతరావు, కంచర్ల గురవయ్య, తోర్లపాటి బాబు, జంగా రామచంద్రారెడ్డి, బోడ వజ్రం, ఎస్‌కే జానీ, గంధం అంజమ్మ, ఎస్‌కే మస్తాన్, నాగేశ్వరావు, తొర్లపాటి రాజు, ముల్లంగి కిషోర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

ప్రజా చైతన్య యాత్ర

రాష్ట్ర కమిటీ పిలుపులో భాగంగా సీపీఎం మండల కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ప్రజా చైతన్య యాత్ర నిర్వహించారు. ఇందులో భాగంగా పట్టణంలో నత్త నడకన నడుస్తున్న నూరు పడకల ఆసుపత్రిని సందర్శించారు. ఈ సందర్భంగా రామిశెట్టి సత్యనారాయణ మాట్లాడుతూ గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో మంజూరైన నూరు పడకల ఆసుపత్రిని తరువాత అధికారంలోకి వచ్చిన టీడీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. 2019లో వైఎస్ఆర్ సిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక నూరు పడకల ఆసుపత్రికి 25 కోట్లు నిధులు మంజూరు చేసి 80 శాతం పనులు కూడ పూర్తి చేశారని తెలిపారు. మిగిలిన పనులను పూర్తి చేసి ఆసుపత్రిని ప్రారంభించాల్సిన ప్రస్తుత కూటమి ప్రభుత్వం పట్టించుకోకపోవడంతో పనులు నత్త నడకన నడుస్తున్నాయని విమర్శించారు. కార్యక్రమంలో పి.పాండురంగారావు, సూర్య కుమార్, కురిసెట్టి అనురాధ, ఎస్.వరలక్ష్మీదేవి, సత్యనారాయణ, సులోమాను పాల్గొన్నారు.

చలివేంద్రం ప్రారంభం



చలివేంద్రాన్ని ప్రారంభిస్తున్న హెల్పింగ్ హ్యాండ్స్ ప్రతినిధులు

జంగారెడ్డిగూడెం: హెల్పింగ్ హ్యాండ్స్ వెల్ఫేర్ సొసైటీ, యర్నగూడెం బొల్లిన గంగరాజు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పూర్వ విద్యార్థుల ఆధ్వర్యంలో శుక్రవారం జంగారెడ్డిగూడెం బస్ స్టాండ్ ఆవరణలో చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. చలివేంద్రాన్ని జంగారెడ్డిగూడెం బాలుర హైస్కూల్ హెచ్‌ఎం లోవ కుమారి ప్రారంభించారు. ఈ సందర్భంగా లోవ కుమారి మాట్లాడుతూ యర్నగూడెం హైస్కూల్ పూర్వ విద్యార్థులు సంస్థను స్థాపించి, ఈ సంస్థ ద్వారా సేవా కార్యక్రమాలు చేయడం ఆనందంగా ఉందన్నారు. కార్యక్రమంలో సెక్రటరీ తిరుపతి ప్రసాదు, సభ్యులు రొక్కం శ్రీను, చరణ్ తేజ, తనుజ, పద్మజ, ఉమారాణి, కోరం ఆంజనేయులు, పెద్దిరాజు, పవన్ కుమార్, తదితరులు పాల్గొన్నారు.

నేటి నుంచి రామాలయ పునః ప్రతిష్ఠ



ఆహ్వాన పత్రికను ఆవిష్కరిస్తున్న ఆలయ కమిటీ సభ్యులు

జంగారెడ్డిగూడెం: పట్టణంలోని రామచంద్రపురంలో నూతనంగా నిర్మించిన కోదండ రామాలయ పునఃప్రతిష్ఠ కార్యక్రమాలు ఈ నెల 15వ తేదీ నుంచి మూడు రోజుల పాటు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. శుక్రవారం ప్రతిష్ఠ కార్యక్రమాల ఆహ్వాన పత్రికను ఆవిష్కరించారు. 15వ తేదీ గణపతిపూజ, అంకురారోపణ, దీక్షాధారణ, వాస్తుహోమం, కలశస్థాపన, జలాధివాసం, క్షీరాధివాసం, బలిహరణ తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించనున్నారు. 16వ తేదీ పుణ్యాహవచనం, మంత్రహోమాలు, నక్షత్ర, నవగ్రహ హోమాలు, నవకలశస్థాపన, శయ్యాధివాసం, గ్రామత్సోవం, నారాయణం వేదపారాయణలు, హోమాలు తదితర పూజలు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. 17వ తేదీ ఉదయం 10.22 గంటలకు కోదండ రామాలయ విగ్రహ, యంత్ర, శిఖర, ధ్వజ, పరివార దేవతా పునర్‌నూతన ప్రతిష్ఠ దీక్షతో నిర్వహించనున్నారు. వాస్తు విద్వాన్ పండిట్ చావా రమేష్‌బాబు, బ్రహ్మశ్రీ గరిమెళ్ల ప్రభాకరశాస్త్రి, బ్రహ్మశ్రీ తంగిరాల సూర్యనారాయణ శర్మ ఆధ్వర్యంలో పూజా కార్యక్రమాలు నిర్వహిస్తారన్నారు. పరిమి ధర్మరాజు, పరిమి సత్తిపండు, కొండ్రెడ్డి కిషోర్, మోతుకూరి నారాయణరావు, వరికూటి ధర్మారావు, విజయ రవీంద్రబాబు, బ్రహ్మానందరావు పాల్గొన్నారు.

ముగిసిన కల్యాణోత్సవాలు



మదన గోపాలస్వామి

కొయ్యలగూడెం: రుక్మిణి సత్యభామ సమేత మదన గోపాల స్వామి కల్యాణోత్సవాలు శుక్రవారంతో ముగిశాయి. ఈ నెల పదో తేదీ నుంచి కల్యాణోత్సవాలు ప్రారంభం కాగా ఐదు రోజుల పాటు అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఆలయ ప్రధాన అర్చకులు గుడిపూడి వెంకట రామ శేషాచార్యులు, బ్రహ్మశ్రీ పార్థసారథి పురోహితుల ఆధ్వర్యంలో ప్రసాద వితరణ కార్యక్రమం నిర్వహించారు.

కరుణించు.. కనకదుర్గమ్మ

ఘనంగా ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు



అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పిస్తున్న మాజీ ఎమ్మెల్యే బాలరాజు దంపతులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరంలో కొలువైన కనకదుర్గమ్మ, అన్నపూర్ణ విశ్వేశ్వర స్వామి వారి 100వ సంవత్సర ఉత్సవాలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. విఘ్నేశ్వర పూజ, అమ్మవారికి అభిషేకంతో పాటు ఆలయ ధర్మకర్త భౌమరాజు సత్యనారాయణ రాజు, గిరిజ దంపతులు ఆలయ కమిటి పెద్దలు నూతన వస్త్రాల సమర్పణతో ఈ మహోత్సవాలు ప్రారంభమయ్యాయి.

కనకదుర్గమ్మ సేవలో మాజీ ఎమ్మెల్యే దంపతులు

మండలంలోని రెడ్డిగణపవరంలో ప్రారంభమైన జాతర మహోత్సవాల సందర్భంగా శుక్రవారం కనకదుర్గమ్మను మాజీ ఎమ్మెల్యే తెల్లం బాలరాజు, రాజ్యలక్ష్మి దంపతులు దర్శించుకున్నారు. ఈ సందర్భంగా అమ్మవారికి నూతన వస్త్రాలను సమర్పించి ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో ఆలయ కమిటి ప్రతినిధులు అల్లూరి రత్నాజీరావు, జెడ్పీటీసీ మొడియం రామతులసి, వైస్ ఎంపీపీ వరలక్ష్మి, తదితరులు పాల్గొన్నారు.

నిఘా నీడలో తిరునాళ్ల



తిరునాళ్లను సీసీ కెమెరాల్లో పర్యవేక్షిస్తున్న పోలీసులు

బుట్టాయగూడెం: మండలంలోని రెడ్డిగణపవరం కనకదుర్గమ్మ, అన్నపూర్ణ విశ్వేశ్వరస్వామి వారి తిరునాళ్ల గట్టి భద్రత మధ్య నిర్వహిస్తున్నారు. సీఐ బి.వెంకటేశ్వరరావు, ఎస్సై దుర్గా మహేశ్వరరావు ఆధ్వర్యంలో తిరునాళ్లను సీసీ కెమేరాలతో పర్యవేక్షిస్తున్నారు. రద్దీ ప్రదేశాలను అడుగడుగునా సీసీ కెమేరాలు ఏర్పాటు చేసి భక్తులకు ఎటువంటి అసౌకర్యం కలగకుండా బందోబస్తు నిర్వహించారు.

రోడ్డు నిర్మాణం పూర్తి చేయాలి



నిరసన వ్యక్తం చేస్తున్న డీవైఎఫ్ఐ నాయకులు

జంగారెడ్డిగూడెం: మండలంలోని మైసన్నగూడెంలో జంగారెడ్డిగూడెం–ములగలంపల్లి రోడ్డు నిర్మాణం చేపట్టాలని ప్రజా సంఘాల నాయకులు నిరసన వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమానికి ఉండరాజు వరకు బక్కయ్య అధ్యక్షత వహించగా కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి ఎ.ఫ్రాన్సిస్ మాట్లాడుతూ 15 సంవత్సరాలుగా ములగలంపల్లి నుంచి జంగారెడ్డిగూడెం బైపాస్ వరకు అన్యాక్రాంతంగా ఉన్న రోడ్డుని నిర్మించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయన్నారు. అధికారంలోకి వచ్చిన నాయకులు మాటలకు పరిమితం అవుతున్నారని విమర్శించారు. ఈ రోడ్డుపై ప్రయాణిస్తున్న సమయంలో రోడ్డుపై వస్తున్న దుమ్ము, ధూళితో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని తక్షణమే ప్రభుత్వం రోడ్డును నిర్మించి ప్రజా సమస్యలు పరిష్కరించాలన్నారు. డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి.సూర్యకిరణ్ మాట్లాడుతూ బడ్జెట్‌లో కోట్ల రూపాయలు రోడ్ల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వం ప్రధాన రహదారి నిర్మించడంలో విఫలమవుతుందన్నారు. కార్యక్రమంలో డంపు కళాకారుల సంఘం అధ్యక్ష కార్యదర్శులు కులపాకుల వీర్రాజు, పిల్లి చంటి, పి.పోతురాజు తదితరులు పాల్గొన్నారు.

కారల్ మార్క్స్‌కు ఘన నివాళి



కారల్‌మార్క్స్ చిత్ర పటం వద్ద నినాదాలు చేస్తున్న నాయకులు

జంగారెడ్డిగూడెం: ప్రపంచ మానవాళికి దిక్సూచిగా కమ్యూనిస్టు సిద్ధాంతాన్ని అందించిన మేధావి కారల్ మార్క్స్ అని సీపీఎం మండల కార్యదర్శి ఎం.జీవరత్నం అన్నారు. జంగారెడ్డిగూడెం సీపీఎం కార్యాలయంలో శుక్రవారం కారల్‌మార్క్స్ 142వ వర్ధంతిని నిర్వహించారు. మార్క్స్ చిత్రపటానికి పూలమాల వేసి జోహార్లు అర్పించారు. కార్యక్రమంలో కె.సుబ్బారావు, పి.పోతురాజు, పి.చంటి, పి.వీర్రాజు, బి.నాని, డి.ఆశీర్వాదం, కె.స్టాలిన్, వి.రెడ్డి, ఎన్.భద్రయ్య, బి.ఆనందరావు తదితరులు పాల్గొన్నారు.

స్వామి వారి సేవలో పలువురు ప్రముఖులు

భీమడోలు: గుండుగొలనులో శ్రీదేవి, భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి వారి ఆలయంలో అబ్కారీ శాఖ మాజీ కమీషనర్ మామిళ్లపల్లి ఆదిశేషు, పెద్దలు మామిళ్లపల్లి పార్థసారధిలతో పాటు వారి కుటుంబ సభ్యులు శుక్రవారం స్వామి వార్లను దర్శించుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు మంగపతి ఆచార్యులు ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు చేశారు. వారిని ఆలయ మర్యాదలతో స్వాగతం పలికి ఘనంగా సత్కరించారు. అనంతరం వారు స్వామి వార్లకు నూతన వస్త్రాలు బహూకరించారు. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు వగ్వాల అచ్యుతరామారావు, పెద్దలు, భక్తులు పాల్గొన్నారు.